క్లుప్తంగా

మొక్కలు ధ్వంసం



పీకేసిన మొక్కలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాంలో పతివాడ మధుసూదనరావుకు చెందిన పొలంలో నాటిన ఆఫ్రికన్ మహాగణి మొక్కలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధిత రైతు నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 151-9, 22లో లక్షలాది రూపాయలను వెచ్చించి విలువైన మొక్కలను నాటామన్నారు. నీళ్లు కట్టేందుకు శుక్రవారం పొలానికి వెళ్లగా సుమారు 250 మొక్కలు నరికేసి ఉన్నాయన్నారు. మొక్కలు ధ్వంసం చేసిన వారిని గుర్తించి తనకు న్యాయం చేయాలని కోరారు. రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రావాడలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

భోగాపురం: మండలంలోని రావాడ పంచాయతీ దరి రజకపేటలో గురువారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పోలిపల్లి శాంతికి చెందిన పూరిల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న సామగ్రితో పాటు రూ. 1.50 లక్షల నగదు కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, సర్పంచ్ అప్పుర భుక్త పైడినాయుడు శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

రూ. లక్ష కోట్ల టర్నోవర్..

- బ్యాంక్ ఆఫ్ బరోడా రీజియన్ హెడ్ పీఎం ప్రధాన్



బీఓబీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రాధిక , రీజియన్ హెడ్ ప్రధాన్, తదితరులు

పూసపాటిరేగ: బ్యాంక్ ఆఫ్ బరోడా దేశ వ్యాప్తంగా రూ. లక్ష కోట్ల టర్నోవర్ కలిగి ఉందని బ్యాంక్ ఆఫ్ బరోడా రీజియన్ హెడ్ పీఎం ప్రధాన్ అన్నారు. సాలిపేట రోడ్డులో ఏర్పాటు చేసిన నూతన బ్రాంచ్‌ను ఎంపీడీఓ ఎం. రాధికతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా 8,500 బ్రాంచ్‌లున్నాయని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 350 వరకు బ్రాంచీలున్నాయన్నారు. రైతులు, మహిళా సంఘాలు, పారిశ్రామికవేత్తలకు తక్కువ వడ్డీకే రుణాలిస్తామన్నారు. గోల్డ్ రుణాలతో పాటు లాకర్ సదుపాయం ఉందని చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్‌మేనేజర్ పి. దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాకు ఆధార్ జత చేయాలి

- విజయనగరం వెస్ట్ సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

నెల్లిమర్ల: ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జామ కావాలంటే బ్యాంక్ ఖాతాకు ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని విజయనగరం వెస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె. సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ పోస్టాఫీస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లా పరిధిలో దాదాపు 1.20 లక్షల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ నంబర్లు జత కాలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు ప్రతి ప్రాంతీయ సచివాలయం పరిధిలో గల పోస్టాఫీసు ద్వారా ఐపీపీబీ (ఇండియన్ పోస్టుపేమెంట్ బ్యాంక్) ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఎల్ లింక్ చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తపాలా కార్యాలయాల్లో ఆధార్ అనుసంధానం

విజయనగరం టౌన్: జిల్లాలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఆధార్ అనుసంధాన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా అకౌంట్లలో జమయ్యేందుకు ఆధార్ సీడింగ్ తప్పనిసరన్నారు. డివిజన్ పరిధిలో సుమారు 1.30 లక్షల మంది ప్రజలకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ సీడింగ్ లేదన్నారు. ఐపీపీబీ అకౌంట్‌ను ఓపెన్ చేయడం ద్వారా ఆధార్ అనుసంధానించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని డివిజన్ పరిధిలో ఉన్న వారందరూ హెడ్‌పోస్టాఫీస్, 34 సబ్ పోస్టాఫీసులు, 308 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దిబ్బేశ్వరస్వామి ఆలయం @ వెయ్యేళ్లు

- కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తుల విశ్వాసం
- వెయ్యేళ్లయినా చెక్కు చెదరని రాతి కట్టడం
- కార్తీకమాసంలో ఆలయానికి భక్తుల తాకిడి



విశాలంగా దర్శనమిస్తున్న ఆలయ ప్రాంగణం

నెల్లిమర్ల రూరల్: జిల్లాలోనే అత్యంత పురాతనమైన ఆలయంగా దిబ్బేశ్వరాలయం ప్రసిద్ధి పొందింది. విజయనగరం నుంచి నెల్లిమర్ల వెళ్లే రహదారిలో సారిపల్లి సమీపంలో గల పారిశ్రామికాభివృద్ధి ప్రాంతాన్ని ఆనుకుని ఈ ఆలయం ఉంది. చంపావతి నది ఒడ్డున ప్రశాంతమైన వాతావరణంలో వెలిసిన ఈ ఆలయానికి వెయ్యి సంవత్సరాల పైనే చరిత్ర ఉంది. ప్రస్తుతం పురావస్తు శాఖ అధీనంలో ఉన్న ఈ ఆలయానికి ఏటా వేలాదిమంది భక్తులు తరలివస్తారు. కోరిన కోరికలు తీర్చే దైవంగా ఇక్కడ దేవుడిని భావిస్తారు. శివునికి మరో రూపమైన దిబ్బేశ్వర స్వామిని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయనేది భక్తుల నమ్మకం. ఆలయం లోపల శివ లింగంతో పాటు పార్వతీదేవి విగ్రహం, నందీశ్వరుడి విగ్రహాలున్నాయి.

పురాతన జైన దేవాలయం..

దిబ్బేశ్వరాలయాన్ని జైనులు కట్టడంగా పురావస్తు శాఖ గుర్తించింది. 11వ శతాబ్దంలో ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. అప్పట్లో జైనులు దీన్ని నిర్మించారని పురావస్తుశాఖ చెబుతుండగా... స్థానికులు మాత్రం స్వయంగా దేవతలే ఆలయాన్ని నిర్మించారని చెబుతారు. పూర్వం ఈ రహదారిలో జన సంచారం అసలు ఉండేది కాదని... సారిపల్లి గ్రామస్తులే ఈ అడవి గుండా నడిచి వెళ్లేవారని చెబుతారు. అప్పటిలో ప్రతిరోజూ అర్ధ రాత్రి దేవతలు స్వయంగా ఈ ప్రాంతానికి వచ్చి ఆలయాన్ని నిర్మించే వారని భావిస్తున్నారు. వేకువజామున ప్రజల అలికిడి విని మళ్లీ వెళ్లిపోయేవారని, అర్ధరాత్రి వేళ ఆలయంలో భజనలు చేస్తున్న శబ్దాలు కూడా వినబడేవంటూ పలు ఊహాగానాలున్నాయి.

పూర్తిగా రాతి నిర్మాణమే..

ఆలయం పూర్తిగా రాతితో నిర్మించారు. నిర్మాణంలో ఎక్కడా సున్నం గాని, సిమెంట్ గాని ఉపయోగించలేదు. రాళ్లపై శిల్పాలు చెక్కి ఒక దానిపై ఒకటి పేర్చి నిర్మించారు. ఆలయాన్ని నిర్మించి వెయ్యేళ్లు దాటుతున్నా ఏ మాత్రం చెక్కుచెదరలేదు. ఆలయానికి ఉన్న ప్రహరీ కూడా పూర్తిగా రాతి కట్టడమే.

కార్తీకమాసంలో సందడే సందడి..

కార్తీకమాసంలో ఈ ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. వనసమరాధనకు అనువైన ప్రదేశం కావడంతో ఈ మాసమంతా సందర్శకులతో కళకళలాడుతుంది. అలాగే శివరాత్రి రోజున స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా ఈ ఆలయానికి చేరుకుంటారు. విజయనగరం, నెల్లిమర్ల, గుర్ల, తదితర ప్రాంతాల నుంచి పిక్నిక్‌ల కోసం వస్తుంటారు. ఆలయం పక్కనే చంపావతి నది ఉండడంతో సందడి వాతావరణం నెలకొంటుంది.

స్వయంగా అభిషేకం చేసుకునే అవకాశం..



కార్తీకమాసంలో స్వయంగా భక్తులే శివలింగానికి అభిషేకం చేసుకునే అవకాశం ఈ ఆలయంలో ఉంది. శిలల ఆకృతిని పరిశీలిస్తే 11వ శతాబ్దంలో జైనులు నిర్మించిన ఆలయంగా స్పష్టమవుతోంది. ఈ ఆలయం తర్వాత రామతీర్థం గురుభక్తుల కొండపై జైనుల కట్టడాలు కనిపిస్తాయి. ఆలయ వైభవాన్ని చాటి చెప్పేందుకు సేవా సంఘం తరఫున కృషి చేస్తాం.

– సుదర్శన విజయ్‌కుమార్, రామతీర్థం సేవా సంఘ కార్యదర్శి, రామతీర్థం

సాగునీటి సంఘాల ఎన్నికలకు సహకరించాలి



విజయనగరం రూరల్: సిబ్బందికి అవగాహన కలిగిస్తున్న అధికారి

నెల్లిమర్ల: మండలంలో ఈ నెల 21న సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సిబ్బంది సహకరించాలని తహసీల్దార్ సుదర్శన రావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, నీటిపారుదల విభాగం ఏఈఈ పిన్నింటి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 14 సంఘాలకు ఈ నెల 21వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీసీ మెంబర్ల ఎన్నిక.. 2 గంటల నుంచి నీటిసంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ, కార్యాలయ ఏఓ పాల్గొన్నారు.

సిద్ధం కావాలి..

విజయనగరం రూరల్: ఈనెల 20, 21వ తేదీలలో జరగనున్న నీటిసంఘ ఎన్నికలకు సిద్ధం కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడిఓ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వంద ఎకరాలు దాటిన చెరువులు 13 ఉన్నాయని తెలిపారు. ఒక్కో చెరువుకు ఆరుగురు మెంబర్లు ఉంటారని తెలిపారు. ఈ ఆరుగురు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నికల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఆయనతో పాటు కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

దైవభక్తి కలిగి ఉండాలి..

- మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి



దుర్గా పీఠంలో పూజలు చేస్తున్న ఝాన్సీలక్ష్మి, తదితరులు

పూసపాటిరేగ: ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తకొప్పెర్లలో సుమారు 20 లక్షల రుపాయలతో స్వర్గీయ బొత్స గురునాయుడు, ఈశ్వరమ్మ దంపతులు జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించిన దుర్గాభవానీ పీఠాన్ని ఆమెతో పాటు బొత్స లక్ష్మణరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అందరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. తోటి వారికి సహాయం చేయాలనే తపన ప్రతిఒక్కరిలో ఉండాలని ఆకాంక్షించారు. నేటి ప్రపంచంలో ఆధ్యాత్మిక ఆలోచనలు కనుమరుగవుతున్న తరుణంలో పీఠాలు, ఆలయాలు నిర్మించడం ఎంతో అవసరమన్నారు. అనంతరం దుర్గాదేవి పీఠం ప్రాంగణంలో కొప్పెర్ల సర్పంచ్ శంకాబత్తుల సత్తిబాబు దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, ప్రజాప్రతినిధులు బొత్స చైతన్యబాబు, పిన్నింటి వెంకటరమణ, రొతు శ్రీరామ్మూర్తి, నక్కాన రమణ, కంది సూర్యనారాయణ, మహంతి శివ, పల్లె భాస్కరరావు, కె. చినబాబు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలో మురుగు నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు తహసీల్దార్ సుదర్శన రావు, కమిషనర్ కె. అప్పలరాజు శుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. పట్టణంలోని విశ్వంభర పాఠశాలకు దగ్గరలో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట టీపీఎస్ ఫిలిప్స్, మండల సర్వేయర్, వీఆర్వో, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆధార్ అనుసంధానం కాని ఖాతాలు 44,479



సమావేశానికి హాజరైన సచివాలయ కార్యదర్శులు

విజయనగరం: నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో ప్రజల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను పోస్టల్ శాఖ ద్వారా మరింత సులభతరంగా చేపట్టనున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య అన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పోస్టల్ శాఖ అధికారులు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సచివాలయ పరిధిలో కార్యదర్శులు ప్రజల అకౌంట్లను ఆధార్‌తో అనుసంధానిస్తున్నారని చెప్పారు. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఆర్థికపరమైన అంశాలు సులభతర రీతిలో జరిగేందుకు ఎన్‌పీసీఐ విధానం శ్రేయస్కరమని తెలిపారు. ఇందుకోసం ఇదివరకే బ్యాంక్ అకౌంట్లు ఉన్నవారికి ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నారని, అయితే ఇంకా 44,479 మంది అకౌంట్లు అనుసంధానం కాలేదని తెలిపారు. కార్యక్రమంలో టీపీఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

12న సినీ సంగీత విభావరి



సినీ సంగీత విభావరి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు, తదితరులు

విజయనగరం టౌన్: ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 12న స్థానిక గురజాడ కళాభారతి వేదికపై నిర్వహించనున్న సినీ సంగీత విభావరికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు తెలిపారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ వాయిద్య కళాకారులు, గాయనీ, గాయకులతో సాయి -పవన్ సంగీత నిర్వహణలో భారీ ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, తదితరులను స్మరిస్తూ గానాలాపన చేస్తారని తెలిపారు. సంగీతాభిమానులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాపీఠం ప్రతినిధులు గ్రంధి విష్ణమూర్తి, వైవీవీ సత్యనారాయణ, గాయకులు పాల్గొన్నారు.

సీతారామునిపేటలో నిత్యన్నదాన సత్రం



సత్రంలో పూజలు చేస్తున్న ఈసుబాబు, భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక సీతారామునిపేట జంక్షన్ వద్ద నిత్యన్నదాన సత్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. సద్గురు సిద్ధప్ప రాజయోగేంద్రుల వారి ఆశీస్సులతో ఆయన శిష్యుడు ఈశుబాబు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నూతన అన్నదాన సత్రంలో శుక్రవారం గోపూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, మండపారాధన, వాస్తుహోమం, లక్ష్మీ గణపతి హోమం, రమా సత్యనారాయణస్వామి వ్రతం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, కోలాటం ప్రదర్శనలు నిర్వహించారు.

అనధికార నిర్మాణాల తొలగింపు



పూల్‌బాగ్ ప్రాంతంలో అనధికారిక కట్టడాలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో అనధికారికంగా చేపడుతున్న నిర్మాణాలపై కార్పొరేషన్ యంత్రాంగం దృష్టి సారిస్తోంది. పట్టణ ప్రణాళిక విభాగం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకపోవడంతో పాటు తీసుకున్న అనుమతులకు మించి చేపట్టిన నిర్మాణాలపై చర్యలకు ఉపక్రమిస్తోంది. ఇందులో భాగంగా పూల్‌బాగ్ ప్రాంతంలో కాలువలు, రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశాలతో సిబ్బంది శుక్రవారం తొలగించారు. స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో కాలువను ఆక్రమించి చేపట్టిన ప్రహరీని తొలగించారు. అదేవిధంగా ఇదే ప్రాంతంలో కాలువను కప్పేసి నిర్మించిన బహుళ అంతస్తును టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అనిత నేతృత్వంలో సిబ్బంది పడగొట్టారు. ఇదిలా ఉండగా రెండు రోజులుగా అధికారులు వార్డుల్లో పర్యటిస్తూ, నిర్మాణాలను తొలగిస్తుండడంతో భవన నిర్మాణదారుల్లో ఆందోళన నెలకొంది.

నీటి సంఘాల ఎన్నికపై శిక్షణ..



ఈ నెల 21న జరగనున్న నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బందికి తహసీల్దార్ ఎం.సురేష్, ఇరిగేషన్ జేఈ కనకమహాలక్ష్మి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డెంకాడ, కొండ్రాజు పాలెం, పోలిపల్లి వాటర్ చానల్స్‌కు సంబంధించి భోగాపురం, పోలిపల్లి, ముంజేరు గ్రామాల్లో నాలుగు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన 12 మంది కమిటీ సభ్యుల్లో 10 మంది సభ్యులు కలిసి సంఘం ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ సభ్యులను ప్రతిపాదించాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కిశోర్‌కుమార్, ఏఓ హరికృష్ణ, ఎంఈఓ-2 చంద్రమౌళి, ఈఓపీఆర్‌డీ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

– భోగాపురం

క్షేత్రస్థాయిలో పర్యటించాలి..



సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. డివిజన్ పర్యటనలో భాగంగా పూల్‌బాగ్, ఎన్టీఆర్ జంక్షన్, వాటర్ ట్యాంక్, ఆటో జంక్షన్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ శుక్రవారం పర్యటించారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఆస్తి పన్ను విధించని భవనాలను గుర్తించి వెంటనే పన్ను వేయాలని సూచించారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు విచక్షణా రహితంగా అతికిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సింగిల్ యూజ్ పాలిథిన్ ఉత్పత్తులు వినియోగిస్తున్న వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టీపీఎస్ అనిత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

– విజయనగరం

ప్రణాళికా విభాగం కీలకం



పట్టణాలు అద్భుత నగరాలుగా రూపాంతరం చెందడంలో ప్రణాళిక విభాగం కీలక భూమిక పోషిస్తుందని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అసిస్టెంట్ సిటీ ప్లానర్లు ఐవీ రమణమూర్తి, హరిబాబు, తదితరులు కమిషనర్ పి. నల్లనయ్యను సత్కరించారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా నగరీకరణ జరగడానికి ప్రణాళిక విభాగం ముఖ్య కారణంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ సింహాచలం, టీపీఓ అప్పలరాజు, టీపీఎస్ అనిత, ప్రణాళిక విభాగం సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

– విజయనగరం


రక్తదానానికి విశేష స్పందన



సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆనంద్ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లో నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 89 మంది దాతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, యువసేన నాయకులు పంచాది కిరణ్, బైరెడ్డి కల్యాణ్, మహంతి శ్రీహరి, కలిశెట్టి కన్నంనాయుడు, కాళ్ల రాజశేఖర్, చందక శంకర రావు, తదితరులు పాల్గొన్నారు.

– నెల్లిమర్ల

సహస్ర దీపాలంకరణ..



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతా రామచంద్ర స్వామిని అర్చకులు నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దనున్న ప్రాంగణ వేదిక వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం సహస్ర దీపాలంకరణ వేడుకను ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక ఊయల్లో స్వామి వారిని ఉంచి దీపపు కాంతుల వెలుగుల్లో ఊంజల్ సేవతో పాటు అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. కార్తీక శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు వరప్రసాద్, కిరణ్‌కుమార్, రామగోపాలాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com